


గ్రామ సింహాల కవాతు

పోలీసులు, జవాన్లు కవాతు చేసినట్లు కొత్తూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గ్రామ సింహాలు సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారిపై గుంపులా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పెంజర్ల రహదారి, జేపీ దర్గా రోడ్డు, పాత జీపీ రోడ్డుతో పాటు ఆయా కాలనీల్లో నిత్యం ఇలా కుక్కలు సంచరిస్తూ చిన్న పిల్లలను భయపెడుతున్నాయి. - కొత్తూర్

నిత్యావసర ధరలకు రెక్కలు వచ్చాయి. అమాంతం పెరిగిన ధరలకు సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కూరగాయలు, వంటనూనె, బియ్యం, ఉల్లి, అల్లం వెల్లుల్లి తదితరాల రేట్లు అందనంత ఎత్తులోకి చేరుకున్నాయి. ఇప్పటికే ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజుల భారం మోయలేకపోతున్న మధ్యతరగతి ప్రజలు... నిత్యావసర ధరల పెరుగుదలతో ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని ఆవేదన చెందుతున్నారు.



ధర దడ!

కొనలేం.. తినలేం..



నిత్యావసరాలు ధరలు భారీగా పెరిగాయి. ఇలాగే ఉంటే దసరా పండగ చేసుకోవడం కష్టమే. కూరగాయలు కొనే పరిస్థితి కనిపించడం లేదు. కిలో ఉల్లిగడ్డ 70 రూపాయలకు అమ్ముతున్నారు. ఇలాగైతే.. ఏం కొనలేం. ఏం తినలేం. ప్రభుత్వం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలి. - బంగారు మాణమ్మ, తుమ్మలపల్లి, జిల్లేడు చౌదరిగూడ మండలం

రూ.500కు ఏం రావడం లేదు



వంద రూపాయలు తీసుకొని సంతకు వెళితే ఏం రావడం లేదు. పెరుగుతున్న ధరలను చూస్తే భయమేస్తుంది. ఇలాగే ఉంటే బతకడం కష్టం. ప్రభుత్వాలు నిత్యావసర ధరలు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. ఉచితాల బదులు వీటిపై దృష్టి సారించాలి. - మాధవి, గృహిణీ, పరిగి

- ✦ అమాంతం పెరిగిన కాయగూరల ధరలు
- ✦ దిగుమతి సుంకం పెంపుతో కాగుతున్న నూనెలు
- ✦ కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి
- ✦ ఘాటెక్కిన అల్లం వెల్లుల్లి, మార్కెట్‌లోకి కల్తీ పేస్టు

వంటింట.. కూరల మంట

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : కూరగాయల ధరలు ఇటీవల విపరీతంగా పెరిగాయి. అన్ని రకాల కూరగాయలు అర్ధ సెంచరీ దాటేశాయి. చాలామంది కేజీ కూరగాయలు కొనేవారు అర కేజీ.. అరకేజీ కొనేవారు.. పావు కేజీతో సరిపెట్టుకుంటున్నారు. బీన్స్, క్యాప్సికమ్, బీన్స్, చామగడ్డ కేజీ 80 రూపాయలు అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కాకర, గోకర, బెండ, దొండ, బీర, చిక్కుడు కాయ రూ.60 అమ్ముతున్నారు. 15 రోజుల క్రితం రూ.20 నుంచి 30 కిలో అమ్ముడుపోయిన టమాట ఇప్పుడు రూ.50కు చేరుకుంది. ఆలుగడ్డ, వంకాయ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ రేట్లు రూ.50కి విక్రయిస్తున్నారు. ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు ఆకు కూరలు, కాయగూరలు దెబ్బతిన్నాయి. దీంతో వీటి రేట్లు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. పాలకూర, తోట కూర, గోంగూర, పొనగంటి కూర, బచ్చల కూర, మెంతి కూర ధరలు భారీగా పెరిగాయి. కొత్తిమీర ధర పైపైకి ఎగబాకింది. ఒక కట్టకి 40 రూపాయలు తీసుకుంటున్నారు. దసరా సమీపిస్తున్న నేపథ్యంలో. ధరలు ఇలా ఉంటే.. ఈసారి పండగ చేసు కోవడమెలా అని మధ్యతరగతి కుటుంబాలు వాపోతున్నాయి.

సలసల కాగుతున్న నూనెలు

వంట నూనె ధరలు సలసల కాగుతున్నాయి. ఉన్నట్టుండి కిలోపై రూ.20 పెరిగింది. ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, పొద్దుతిరుగుడు నూనె ధరలు భగ్గుమంటున్నాయి. విదేశీ దిగుమతులపై సుంకాన్ని కేంద్రం పెంచడంతో నూనె ధరలు భారీగా పెరిగాయి. వంట నూనె ధర పెరగడంతో కల్తీ నూనె రంగ ప్రవేశం చేసే అవకాశముంది.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

ఉల్లి ధర కన్నీరు తెప్పిస్తుంది. ఇప్పటికే కిలో ఉల్లి ధర 70 రూపాయలు పలుకుతుంది. నవంబర్ నెలలో ఉల్లి రేటు కిలోకు రూ.100 నుంచి 120కి పెరిగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో ఉల్లి కొరత, డిమాండ్ పెరగడం.. కొత్త పంట మార్కెట్‌లోకి ఇంకా రాకపోవడంతో ధరలు భారీగా పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధరల పెంపుతో వినియోగదారుల ఆగ్రహం

వంట నూనెల ధరల పెంపుతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న సరుకును కూడా ఎక్కువ ధరకు విక్రయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రేట్ హోల్‌సేల్‌గా లీటరు రూ.110 అమ్ముతుండగా చిల్లరగా రూ.125 చొప్పున విక్రయిస్తున్నారు. పొద్దు తిరుగుడు నూనె కొన్ని స్థానిక దుకాణాల్లో లీటరు రూ.140 చొప్పున అమ్ముతున్నారు. పూజలకు విక్రయించే వివిధ రకాల నూనెలు లీటరు ధర మొన్నటి వరకు రూ. 109 వరకు ఉండగా ఇవి ఇప్పుడు రూ.120కి చేరాయి.

ఘాటెక్కిన అల్లం వెల్లుల్లి

అల్లం, వెల్లుల్లి సామాన్యులు కొనలేని పరిస్థితి ఉంది. కిలో వెల్లుల్లి ధర రూ.320, అల్లం రూ.200కు అమ్ముతున్నారు. సిటీకి ఎక్కువగా కేరళ, కర్నాటక, తెలంగాణలోని జహీరాబాద్, కోహిర్ నుంచి అల్లం వెల్లుల్లి దిగుమతి చేసుకుంటున్నారు. దిగుమతులు తగ్గడంతో ధర పెరిగినట్లు తెలుస్తుంది. రేటు పెరగడంతో కొందరు అక్రమార్కులు కల్తీ పేస్టు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే అల్లం, వెల్లుల్లి పేస్టు అంటూ నమ్మిస్తున్నారు. గల్లీలోని కిరాణా షాపుల్లో తయారిదారుల పేరు, తేదీలు లేని అల్లం వెల్లుల్లి పేస్టు డబ్బాలు అమ్ముతున్నారు. తక్కువ ధరకు దొరికే కల్తీ పేస్టు కొనుగోలు చేస్తే అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని డాక్టర్లు చెబుతున్నారు.

కూరగాయల ధరలు(కిలో రూ.లలో)

అల్లం : 200	కీర : 50
వెల్లుల్లి : 320	వంకాయ : 50
బీన్స్ : 80	నిమ్మకాయలు : రూ. 20కి మూడు
క్యాప్సికమ్ : 80	కొత్తిమీర కట్ట : రూ.40 (ఒకటి)
చామగడ్డ : 80	తోటకూర, పాలకూర, పూదీన, గోంగూర, పొనగంటి కూర, మెంతి కూర : రూ.10 (చిన్నసైజు కట్టకు)
ఉల్లిగడ్డ : 70	
బెండ : 60	
దొండ : 60	
చిక్కుడు : 60	
బీర : 60	
పచ్చి మిర్చి : 60	
గోకర : 60	
కాకర : 60	
క్యారెట్ : 60	
ఆలుగడ్డ : 50	
టమాట : 50	

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ శశాంక



షాబాద్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ శశాంక

షాబాద్, సెప్టెంబరు 21 : పారిశుధ్యం, ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. శనివారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వ్యక్తిగత పని నిమిత్తం విచ్చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ అన్వర్, షాబాద్ ఎంపీడీవో అపర్ణ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై ఆరా తీశారు. షాబాద్ రెవెన్యూ పరిధిలోని నరేడ్లగూడ, షాబాద్ గ్రామాల భూములకు ఒకే సర్వే నంబర్లు ఉన్నాయని తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన.. వెంటనే ప్రపోజల్ పెట్టండి, సరిచేద్దామని తెలిపారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, మిషన్ భగీరథ నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట చేవెళ్ల, షాబాద్ ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



జేపీదర్గా వద్ద ఊరేగింపు నిర్వహిస్తున్న కడప పీర్‌బాయ్ శిష్యుల బృందం

కొత్తూర్, సెప్టెంబరు 21: మిలాద్-ఉన్-నబీ ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో కడప పీర్ బాయి శిష్యుల బృందం ఆధ్వర్యంలో షైనార్టీలు రథం, ఏక్ మినార్‌తో శనివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన భారీ రథాన్ని ఏర్పాటు చేసి చాదర్‌తో పాటు పూజాసామగ్రిని రథంలో పెట్టి ఇన్ముల్‌నర్వ నుంచి జేపీ దర్గాకు వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాకు చాదర్‌లు, పుష్పాలు సమర్పించి పత్యాలు ఇచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్‌అలీఖాన్, పి.రఘు, గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, ఇబ్రహీంలతో పాటు కడప పీర్‌బాయ్ శిష్యులు పాల్గొన్నారు.

ప్రతీ కూలీకి పని కల్పించాలి

కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి టీకే.అనిల్‌కుమార్



రాయపోల్ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్న టీకే.అనిల్‌కుమార్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 21: ఉపాధి హామీ పథకం కింద అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి టీకే.అనిల్‌కుమార్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న ఫాం పాండ్స్ పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో తాగు నీరు, నీడ వసతులు కల్పిస్తున్నారా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక వేతనాల చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయా అని ఆరా తీశారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా రోజువారి కూలీల హాజరును కూడా పరిశీలించారు. పనుల విషయంలో పారదర్శకత ఉండాలన్నారు. అనంతరం స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో భాగంగా రాయపోల్ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. అమ్మ పేరు మీద ప్రతీ ఒక్కరు ఒక మొక్కనాటి సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, స్పెషల్ కమిషనర్ షఫీయుల్లా, జాయింట్ కమిషనర్ నర్సింలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, ఏపీడీలు సక్రియా నాయక్, చరణ్ గౌతమ్, సీఆర్డీ ప్రోగ్రాం అధికారులు మురళి, కృష్ణమూర్తి, అంజద్‌ఖాన్, ఎంపీడీవో వెంకటమ్మ, ఏపీవో తిరుపతాచారి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ వద్దని సోనియా, రాహుల్‌కు లేఖ

పోస్ట్‌మాస్టర్‌కు అందించిన రైతులు



సోనియా, రాహుల్‌కు రాసిన లేఖను పోస్ట్‌మాస్టర్‌కు అందిస్తున్న రైతులు

యాచారం, సెప్టెంబరు 21 : రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు మండలాల మధ్య ఫార్మాసిటీ ఏర్పాటు చేయొద్దని కోరుతూ శనివారం యాచారం మండలం కుర్మిద్దకు చెందిన రైతులు వినోద్‌రెడ్డి, మల్లేష్ తదితరులు ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు లేఖలు రాసి పోస్ట్‌మాస్టర్‌కు అందించారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ మాట మార్చి ఫార్మాసిటీ రద్దు చేసేదిలేదని చెప్పడం దారుణమన్నారు. సమస్య తీవ్రత ను వివరిస్తూ కుర్మిద్దకు చెందిన పలువురు రైతులు ఫార్మాసిటీ రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ అగ్ర నాయకులకు లేఖలు రాశారు. శనివారం వాటిని పోస్ట్ చేయాలని పోస్ట్‌మాస్టర్‌కు అందించారు. ఫార్మాసిటీ రద్దు చేసేదాక పోరాటం కొనసాగిస్తామని రైతులు తేల్చి చెప్పారు.

సేంద్రియంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

- ● నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలి
- ● ఆర్గానిక్ పంటలపై అన్నదాతలు దృష్టి సారించాలి
- ● రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మొక్కలు నాటుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 21: సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు రైతులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. దిగుబడుల పెంపు కోసం పంటల సాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడొద్దని ఆయన సూచించారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ది ఎర్త్ సెంటర్ లో శనివారం మహేంద్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆత్మీయ సమ్మేళనం, ఆర్గానిక్ పంటల సాగుపై రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. సీజీఆర్ అధ్యక్షురాలు కొర్పోలు లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మహేంద్ర ఎఫ్‌పీవో డైరెక్టర్ పొలసాని పంకజ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పోచారం పాల్గొన్నారు. ఎర్త్ సెంటర్ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సీజీఆర్ చైర్మన్ లక్ష్మారెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం వ్యవసాయ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయం లాభసాటిగా మార్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు మార్కెట్‌లోకి అందించేందుకు మహేంద్ర ఫార్మర్స్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆర్గానిక్, లాభసాటి పంటలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎస్. నర్సింహారెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిలర్ చైర్మన్ అనంత నర్సింహారెడ్డి, జమ్మూ కశ్మీర్ మాజీ డీజీపీ గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మాజీ అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, కోరమండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర సెరీకల్చర్ మాజీ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి, మహేంద్ర డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

జలకళ కావొద్దు.. మృత్యుఘోష



నిండుకుండలా గండిపేట జలాశయం

- ✦ భారీ వర్షాలకు నిండిన చెరువులు, కుంటలు
- ✦ జలాశయాల వద్ద కనిపించని సూచిక బోర్డులు
- ✦ పొంచి ఉన్న ప్రమాదాలు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 21: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శివారు ప్రాంతాలలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వీటిని చూసి రైతుల కళ్లలో ఆనందం వ్యక్తమవుతోంది. కానీ ఈ జలాశయాలు కొందరి పాలిట మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. సెలవుల్లో ఈత సరదా కాస్త విషాదంగా మిగిల్చుతుంది. నీటి వనరుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు యువకులు అవగాహన లేక నీటిలోకి దిగి బలవుతున్నారు. ఇలాంటి ఘటనలు గత మూడు సంవత్సరాలుగా మొయినాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో అనేకంగా చోటుచేసుకుంటున్నాయి.

మండలంలోని హిమాయత్ నగర్, ఎన్కేపల్లి, మేడిపల్లి, నక్కలపల్లి, వెంకటాపూర్, చిలుకూరు, గండిపేడ చెరువు, ఎన్కేపల్లి మాల కుంట, పెద్దమంగళవారం, చిన్నమంగళారం, అమ్డాపూర్ గ్రామాల్లోని చెరువులు కుంటలతోపాటు ఈసీ, మూసీ వాగుల్లో పలువురు యువకులు, బాలురు ప్రాణాలు వదులుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇద్దరు, ముగ్గురు చిన్నారులు సైతం ప్రాణాలు కోల్పోయిన ఘటనలు స్థానిక మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఠాణాల పరిధిలో చోటు చేసుకున్నాయి. ఇంట్లో తెలియకుండా స్నేహితులతో బయటకు వెళ్లి ఈత రాకున్నా చెరువుల్లో స్నానాలకు దిగి ప్రాణాలు పోగొట్టుకుని తల్లిదండ్రులకు తీరని దుఖాన్ని మిగిలిస్తున్నారు.

కొన్నేళ్లుగా సుమారు 55 మందికి పైగా యువకులు, బాలురు మృత్యువాతన పడ్డారు. సెల్ఫీల కోసం ప్రయత్నించి సైతం కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గండిపేట చెరువు. చిలుకూరు చెరువు. పెద్దమంగళారం చెరువు, ఈసీ, మూసీ వాగులు, ఎన్కేపల్లి మాలకుంట, హిమయత్ నగర్ చెరువు, హిమాయత్ నగర్ బూరు కుంట, వెంకటాపూర్, నక్కలపల్లి తదితర చెరువులు ప్రస్తుతం నీటితో కళకళలాడుతున్నాయి. ఆ ప్రాంతాల్లో ఎలాంటి విషాద సంఘటనలు జరగకుండా జలమండలి శాఖ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మూడేళ్లలో చోటుచేసుకున్న ఘటనలు..

మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో పడి గత మూడేళ్లుగా అనేక మంది మృత్యువాత పడ్డారు. గతేడాది ఆగస్టులో మండలంలోని హిమాయత్ నగర్‌లోని గండిపేట చెరువులో నగరానికి చెందిన ముగ్గురు యువకులు స్నానానికి వచ్చి లోతైన గుంతలను గమనించకుండా ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతి చెందాడు. ఎన్కేపల్లి గ్రామంలోని మాల కుంటలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి నీట మునిగి మృత్యువాతపడ్డాడు. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని కత్వాలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ముగ్గురు యువకులు మృతి చెందారు. గతంలో మూసీవాగు దాటుతూ ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు.

రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి



నిండుకుండలా ఉన్న చెరువులు, కుంటల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించాలి. గ్రామపంచాయతీల ద్వారా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా రక్షణ వలయాలను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

- కే. సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మొయినాబాద్ మండలం

నీటిలోకి దిగితే చర్యలు



సరదా కోసం ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలు, వాగులు, క్వారీల్లోకి స్నానాలకు వెళ్తే చర్యలు తీసుకుంటాం. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. కొన్నిచోట్ల పోలీసులతో నిఘా ఏర్పాటు చేశాం. గ్రామాల్లో ఉన్న కుంటల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నిస్తాం. - పవన్‌కుమార్ రెడ్డి, సీఐ, మొయినాబాద్



దేవునిఎర్రవల్లిలో నేడు ఉచిత వైద్యశిబిరం


చేవెళ్ల, సెప్టెంబరు 21 : నేడు(ఆదివారం) దేవునిఎర్రవల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విమలా కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకవాలని కోరారు.













చెరువు శిఖం భూమి సర్వే



ఎర్రం చెరువు శిఖం నక్ష మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చౌదరిగూడ, సెప్టెంబరు 21: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని జిల్లేడ్ గ్రామ శివారు సర్వేనంబర్ 145లో ఉన్న ఎర్రం చెరువు శిఖం భూమిని శనివారం ఇరిగేషన్ ఏఈ సింధు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సర్వేయర్ ఆంజనేయలుతో కలిసి పరిశీలించారు. ఈమేరకు చెరువు భూమిని సర్వే చేసి నక్ష ప్రకారం హద్దులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సమీక్ష నిర్వహిస్తున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 21: ఈ నెల 28న నిర్వహించే లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకొని ప్రశాంతమైన జీవితం గడపాలని షాద్‌నగర్ న్యాయ సేవాసాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని పోలీస్ అధికారులతో కోర్టు ప్రాంగణంలో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు చొరవ తీసుకోవాలన్నారు. కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం వృథా చేసుకోవద్దని తెలిపారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి సూరజ్ కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, అన్ని మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

గ్యాస్ లబ్ధిదారులు తప్పులు సరిచేసుకోవాలి



లింగ్యానాయక్, జిల్లా అదనపు కలెక్టర్

వికారాబాద్, సెప్టెంబరు 21:రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.500కు సబ్సిడీ గ్యాస్ పథకంలో లబ్ధిదారు వారి పేర్లు, గ్యాస్ కనెక్షన్ నంబర్లు సరి చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ఎల్పీజీ వినియోగదారుల వివరాల్లో తప్పులుంటే సవరించాలని ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలను ఆదేశించారు. వినియోగదారుల పేర్లు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ల నబంర్లలో తప్పులుంటే గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈ-కేవైసీ చేయించుకొని ప్రజాపాలన సేవ కేంద్రంలో ఎంపీడీవోలకు అందజేయాలని సూచించారు.

బిల్లులు రాలేదని పాడిరైతుల నిరసన



దోమ, సెప్టెంబరు 21: మూడు నెలలుగా బిల్లులు రావడం లేదని గుండాల్‌కు చెందిన విజయ డెయిరీ పాడి రైతులు శనివారం డెయిరీ వద్ద నిరసన తెలిపారు. బిల్లులు రాక తాము ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి తమ పాల బిల్లులను చెల్లించాలని కోరారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

నవాబుపేట, సెప్టెంబరు 21 : మండలంలోని గేటువనంపల్లి రైల్వే గేటు వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి శనివారం ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ జయరాం, రైల్వే ఈఈ రాజీవ్‌రంజన్ స్థలాన్ని పరిశీలించారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో సమీప భూ యజమానులకు ఏమైనా అభ్యంతాలుంటే తెలియజేయాలని కోరారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుపెడతామన్నారు.





అత్యంత విశ్వసనీయ కంపెనీల్లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

శంషాబాద్ రూరల్: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (గతంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్)కు ప్రపంచంలోని అత్యంత విశ్వసనీయ కంపెనీల్లో చోటు లభించింది. ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్, ప్యాకేజింగ్ విభాగంలో అగ్రశ్రేణి విమానాశ్రయ కంపెనీగా న్యూస్‌వీక్ వరల్డ్ మోస్ట్ ట్రస్ట్ కంపెనీలస్ సర్వే-2024లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అంతర్జాతీయంగా ఐదో స్థానాన్ని దక్కించుకుంది. గ్లోబల్ డేటా, బిజినెస్ ఇంటలిజెన్స్ ప్లాట్‌ఫామ్ స్టాటిస్టాతో కలిసి న్యూస్‌వీక్ ఈ సర్వేను రూపొందించింది. 23 పరిశ్రమలు, 20కి పైగా దేశాల్లోని 1,000 కంపెనీలను పరిశీలించి ఈ అవార్డును ప్రకటించారు.

పాఠశాలను నిర్మించడం అభినందనీయం



దేవరయంజాల్‌లో పాఠశాల నూతన భవనం వద్ద దాత రాజన్న, డీఈవో, విద్యార్థులు, సిబ్బంది

శామీర్‌పేట, సెప్టెంబరు 21 : విద్యార్థులకు ఉపయోగపడేలా పాఠశాల భవనాన్ని దాతలు నిర్మించడం అభినందనీయమని డీఈవో విజయ కుమారి అన్నారు. తుముకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌లో పాత పాఠశాలను కూల్చి కొత్తగా నిర్మించేందుకు టాటా సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ అధ్యక్షుడు రాజన్న ముందుకొచ్చి స్కూలును కట్టించారు. ఆధునాతన హంగులతో నిర్మించిన పాఠశాలను శనివారం డీఈవో విజయకుమారి, దాత రాజన్న, హెచ్‌ఆర్ సునీల్, ఎంఈవో వసంతకుమారిలు ప్రారంభించారు. కార్యక్రమంలో దాత రాజన్నను డీఈవో, టీచర్లు, స్థానికులు ఘనంగా సన్మానించారు.

నాగారంలో జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

కీసర, సెప్టెంబరు 21: తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో శనివారం ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలను కలపడం దారుణం అన్నారు. కల్తీ నెయ్యితో లడ్డూచేసి దేవుడికి నైవేద్యం, భక్తులకు ప్రసాదం ఇవ్వడం మహాపాపం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి అపచారానికి ఒడిగట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి ఈవో ధర్మారెడ్డిలపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, రంగారావు, కోటేశ్వర్‌రావు, బ్రహ్మంచౌదరి, వెంకటరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



బీజేపీ సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

కీసర, సెప్టెంబరు 21: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నాగారంలో బీజేపీ సభ్యత్వ నమోదుకు ఎంపీ ముఖ్య అతిథిగా వచ్చి ప్రారంభించారు. ఈటల మాట్లాడుతూ.. నరేంద్రమోదీపై గౌరవంతో ప్రజలు బీజేపీ సభ్యత్వాలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. కష్టపడి పని చేసేవారికి అవకాశాలు వస్తాయన్నారు. ఏ సమస్యొచ్చినా తన వద్దకు రావొచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రూరల్ అధ్యక్షుడు పి.విక్రమ్ రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధారూరు ఏఎంసీ చైర్మన్‌గా విజయబాస్కర్‌రెడ్డి



కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎల్.అశోక్

ధారూరు, సెప్టెంబరు 21: ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కెరెల్లికి చెందిన కె.విజయ భాస్కర్ రెడ్డి, వైస్‌చైర్మన్‌గా ధారూరుకు చెందిన ఎల్.అశోక్‌కు ప్రభుత్వం నియమించింది. డైరెక్టర్లుగా బాబునాయక్, షమీమ్ పాషా, అంజయ్య, వాణిశ్రీ, ప్రతాప్, జైపాల్, శోభ, రవీందర్, రమేశ్, సాయన్న, అమరేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి నియామకమయ్యారు. వీరు రెండేళ్ల పదవుల్లో ఉంటారు.

భూ రికార్డులు సక్రమంగా ఉంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెద్దేముల్, సెప్టెంబరు 21: రైతుల భూ రికార్డులను సక్రమంగా ఉంచాలని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ అన్నారు. పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీచేసి చేశారు. ఏ రికార్డులు ఎలా భద్రపరుస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. రికార్డులు చిందరవందరగా పెట్టొద్దని, సక్రమంగా పెట్టాలని సూచించారు. రైతులు ఎలాంటి సమస్యలపై వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న షీ టీమ్ పరిగి ఇన్‌చార్జి నర్సిములు

దోమ, సెప్టెంబరు 21: మండలంలోని దిర్సంపల్లి ఉన్నత పాఠశాలలో సబ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి నర్సిములు సమక్షంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. డయల్ 100, మహిళలపై జరుగుతున్న నేరాలు, సీసీ కెమెరాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లు చేసుకోవద్దని, చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. హెచ్‌ఎం వెంకటయ్య, టీచర్ రాజు, షీ టీమ్ సభ్యులు మనీషా, శోభారాణి పాల్గొన్నారు.

జంతు జనన నియంత్రణకు చర్యలు

పరిగి/కొడంగల్, సెప్టెంబరు 21: జిల్లాలో జంతు జనన నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా పశువైద్యాధికారి సదానందం తెలిపారు. శనివారం పరిగిలో జననియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రెండు, మూడు రోజుల్లో జననియంత్రణ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ముఖ్యంగా కుక్కల్లో సంతానోత్పత్తి నివారణకు కుక్కలకు ఆపరేషన్లు చేస్తామన్నారు. కుక్కల బెడదను నివారించేందుకు ఈ డ్రైవ్‌ను చేపట్టామన్నారు. వీధుల్లో తిరిగే కుక్కలను జనన నియంత్రణ కేంద్రానికి పట్టుకొచ్చి ఆడ, మగ కుక్కలకు సంతానం కాకుండా శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు. చికిత్స తర్వాత మూడు నుంచి ఐదు రోజులు వాటిని పరిశీలనలో ఉంచి వదుల్తామన్నారు. అలాగే కుక్కలకు రేబీస్ టీకాలు కూడా వేస్తామన్నారు. కుక్కలు పెంచుకుంటున్న వారు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై కుక్కల గురించి భయం వొద్దన్నారు. సంతతి నియంత్రణ, ఒకవేళ అవి కరిచినా మనుషులకు, పశువుకు ఏమీ కాకుండా అవసమైన చర్యలన్నీ తీసుకుంటామని తెలిపారు. పశుసంవర్థక శాఖ సిబ్బందే కుక్కలను పట్టుకొచ్చి ఆపరేషన్లు చేస్తారని వెల్లడించారు. పెంపుడు కుక్కలకు కూడా ఈ ఆపరేషన్లు చేయించుకోవ్చన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, అధికారులు సతీష్, వినోద్ తదితరులు ఉన్నారు. కొడంగల్‌లోని పశువైద్యశాలలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పశువైద్యాధికారి నోహ తెలిపారు. కుక్కల సంతానోత్పత్తిని అరికట్టేందుకు శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. ఇక్కడ త్వరలోనే కుక్కలకు శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు.



పరిగిలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి సదానందం

ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకం

- ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ
- బీసీలకు 90, ఇతరులకు 80 శాతం రాయితీపై డ్రిప్పు, స్ప్రింకర్లు
- చిన్న సన్నకారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, దివ్యాంగులకు ప్రాధాన్యం
- 18 మండలాల్లో 96 మందికి చెందిన 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వంద శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని సమకూర్చాలని నిర్ణయించింది. ఉద్యాన, పట్టు పరిశ్రమ పంటల సాగుకు ప్రభుత్వం సూక్ష్మ సేద్య పరికరాలను అందించనుంది. షెడ్యూల్ కులం/తెగల రైతులకు 100 శాతం రాయితీ కల్పిస్తుంది. అలాగే వెనుకబడిన తరగతుల రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ కల్పించనున్నారు. గరిష్ఠంగా 5 హెక్టార్ల వరకు డ్రిప్పు, స్ప్రింకర్లపై 75 శాతం రాయితీ(హెక్టారుకు) కల్పిస్తారు. చిన్న, సన్నకారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, దివ్యాంగులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రంగారెడ్డి జిల్లాకు సూక్ష్మసేద్య పరికరాలకు 704 ఎకరాలు, స్ప్రింక్లర్లకు 432 ఎకరాల లక్ష్యాన్ని నిర్ణయించారు. గతంలో మీసేవ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు, రైతు వాటా చెల్లించిన తేదీకి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో డ్రిప్, స్ప్రింక్లర్లను అందించనున్నారు. ఆసక్తిగల రైతులు ఉద్యానశాఖ అధికారిని సంప్రదించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె. సురేష్ తెలిపారు.

ఆయిల్ సాగుపై 25న మెగా ప్లాంటేషన్..

జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో 3 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు జిల్లాలో 1310 ఎకరాలకు పరిపాలన మంజూరు ఇవ్వగా.. 854 ఎకరాలు సాగు చేస్తున్నారు. నేలలు, వాతావరణ అనుకూల దృష్ట్యా దీర్ఘకాల పంట అయిన ఆయిల్ పామ్ సాగు త్రికోణ, చతురస్రాకార పద్ధతిలో చేపడుతున్నారు. త్రికోణ పద్ధతిలో ఎకరానికి 57, చతురస్రాకార పద్ధతిలో 50 మొక్కలు నాటుకునేందుకు అనువుగా ఉంటుంది. సాగు విస్తీర్ణతను పెంచే లక్ష్యంగా రాయితీపోను మొక్కకు రూ.20 చొప్పున రైతు వాటాగా చెల్లించాలి. ఔత్సాహిక రైతులు ప్రాంతీయ ఉద్యాన అధికారి, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారి, ఫీల్డ్ ఆఫీసర్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 25న మెగా ప్లాంటేషన్ ద్వారా 300 ఎకరాల్లో 18 మండలాల్లో 96 మంది రైతు పొలాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టనున్నారు.

రైతులు సంప్రదించాల్సిన అధికారులు..

ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మంచాల మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖ అధికారి నవీన (8977714219) ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలి. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట మండలాలకు సంబంధించి కీర్తికృష్ణ (8977714222), ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, రాజేంద్రనగర్ రైతులు సౌమ్య (8977714221), షాద్‌నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడెం, కొందుర్గు మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖ అధికారి హిమబిందు (8977714220)ను సంప్రదించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి తెలిపారు.

అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైనది



మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న రంగరాజన్

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 21: కార్తీకమాసంలో చేపట్టే అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైనదని చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తెలిపారు. చిలుకూరు గ్రామానికి చెందిన విజయ భార్గవరెడ్డి, కుమ్మరి శివశంకర్‌ల ఆధ్వర్యంలో శబరిమలకు వచ్చే నెల 18న చిలుకూరు బాలాజీ ఆలయం నుంచి శ్రీ హనుమధ్వజ శబరిమల మహా పాదయాత్రకు దాదాపు 20 మంది స్వాములు వెళ్లనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను రంగరాజన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ పంతులు, భక్తులు ఉన్నారు.

దైవ సన్నిధిలో అక్రమాలా?

పవిత్రమైన లడ్డూను అపవిత్రం చేస్తారా? : ఎమ్మెల్యే శంకర్

టీటీడీ మాజీ బోర్డు మెంబర్ బక్కని నర్సింహులు



ఎమ్మెల్యే శంకర్, బక్కని నర్సింహులు

షాద్‌నగర్, సెప్టెంబరు 21: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూను అపవిత్రం చేయడంపై షాద్‌నగర్ వీర్లపల్లి శంకర్, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ బక్కని నర్సింహులు మండిపడ్డారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్నే అపవిత్రం చేశారంటే.. ఇక దేశం ఏ విధంగా బాగుపడుతుందని ఎమ్మెల్యే శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిపాలతో సమానంగా చూసే తిరుపతి లడ్డూను భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తయారు చేయడం బాధకరమన్నారు. దైవ సన్నిధిలో అక్రమాలకు పాల్పడటం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. అక్రమాలకు కారకులైన వారిపై ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. టీటీడీ మాజీ బోర్డు సభ్యులు బక్కని నర్సింహులు మాట్లాడుతూ ఏపీ మాజీ సీఎం హయాంలోనే తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అపవిత్రం చేశారని విమర్శించారు. అక్కడ అన్యమత ప్రచారాలు చేయడం, హిందువుల ఆలయాలను కూల్చడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. శ్రీవారి లడ్డూ అపవిత్రం కావడానికి గల కారకులను కఠినంగా శిక్షించాలని కోరారు.

బోగస్ ఓటర్లను తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 21: మండల పరిధిలో ఉన్న బోగస్ ఓటర్లను తొలగించాలని కేశంపేట బీజేపీ శాఖ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ మీర్ ఆజంఅలీకి వినతి పత్రం అందించారు. మండలంలోని అల్వాల, కొత్తపేట, సంతాపూర్, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, తొమ్మిదిరేకుల, కాకునూర్, లేమామిడి, కొనాయపల్లి, నిర్దవెల్లిలో అధికంగా బోగస్ ఓట్లు నమోదవుతున్నట్లు తెలిపారు. గతంలో గ్రామాలను వదిలి హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నవారు, ఇటీవల గ్రామానికి వచ్చి నూతనంగా ఓటు నమోదు చేసుకుంటున్నారని వివరించారు. గ్రామాల్లో ఇల్లు లేకపోయినా ఇతరుల ఇంటి నెంబర్లపై ఓటు నమోదు చేసుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. పాండురంగా రెడ్డి, ఉడుత హరికృష్ణ తదితరులున్నారు.

ఎంఎస్‌ఎంఈ-2024 పాలసీలో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎన్పీఆర్డీ నాయకులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 21: తెలంగాణ ఎంఎస్‌ఎంఈ-2024 పాలసీలో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రమందజేశారు. పాలసీలో సవరణ చేసి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శి జెర్కోని రాజు డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని నిర్దేశించినా అమలు చేయకపోవడం ఆందోళన కలిగిస్తోందని వారన్నారు.

పావలా వడ్డీకే రుణాలివ్వాలి



సమావేశంలో పాల్గొన్న మణెమ్మ, జి.కవిత

కందుకూరు, సెప్టెంబరు 21: డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం పావలాకే రుణాలు మంజూరు చేసినట్లు స్నేహ మహిళ మ్యాక్స్‌కు వర్తింపజేయాలని ఆ సంఘం మండలాధ్యక్షురాలు చల్లా మణెమ్మ, కార్యదర్శి గంగాపురం కవితలు కోరారు. శనివారం మండల కేంద్రంలో జ్యోతి ప్రజ్వల చేసి ఆ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 2014 నుంచి స్నేహ మహిళ మ్యాక్స్‌కు పావలా వడ్డీకి రుణాలు ఇవ్వడం లేదన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 2023-24 సంవత్సరానికి గాను స్నేహ మహిళ మ్యాక్స్ ద్వారా రూ.3కోట్ల రుణాలను అందించడం జరిగిందన్నారు. దీనికి గాను సంఘానికి రూ.20లక్షల లాభం వచ్చినట్లు గుర్తు చేశారు. 15మంది సభ్యులు, డ్వాక్రా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



టీజీవో నూతన కార్యవర్గం

ఉద్యోగ సంఘాలను అణగదొక్కిన బీఆర్‌ఎస్ సర్కార్

మేడ్చల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలపై ఉక్కుపాదం మోపి నిర్వీర్యం చేసే యత్నం చేసిందని రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నికను తూంకుంట మొగుళ్ల వెంకటరామిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ... టీజీవో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసేలా కృషిచేస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడకుండా గత ప్రభుత్వం సంఘాలపై కుట్ర పన్నిందని ఆరోపించారు. గతంలో చేయని పనులను ప్రస్తుత ప్రభుత్వంతో చేయించుకునేలా కార్యాచర రూపొందిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో సమస్యలుంటే కలెక్టర్ల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించుకోవాలని సూచించారు. ఉద్యోగులకు చెందాల్సిన డీఏలను త్వరలో సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, మాజీ ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ

జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా బి.వినోద్‌ను, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కురుమూర్తిలను ఎన్నుకున్నారు. కమిటీలో 19 మందిని ఎంపిక చేశారు.

రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడా పాలసీ అమలుకు చర్యలు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 21: క్రీడా రంగంలో తెలంగాణను దేశంలో అగ్రభాగాన నిలుపాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని, అందుకు ప్రభుత్వం అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ఐ 68వ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈవో బాసు నాయక్ అధ్యక్షతన, ఎంఎన్‌వో జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మండల పరిధిలోని 14 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. పరేడ్, గౌరవందనం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పీడీలు బీముడు, మహమూద్, వెంకటేశ్, ఉపాధ్యాయులు రాధాకృష్ణరెడ్డి, మల్లయ్య, శోభరాణి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు హన్మనాయక్, గూడూరు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, లక్ష్మణ్, శేఖర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, ఇమ్రాన్‌బాబా, శ్రీశైలం, శంకర్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన చిలుక మధుసూదన్‌రెడ్డి



శ్రీధర్‌బాబుకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 21 : గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్(పండ్లు) పదవి వరించిన చిలుక మధుసూదన్‌రెడ్డి శనివారం మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరచారి, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, అంజయ్య, మేకం నర్సింహ, బండి మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం తుర్కయాంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తదితరులు తదితరులు ఉన్నారు.

గౌడ కులస్థుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి



మంత్రి జూపల్లితో గౌడ సంఘం నాయకులు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 21: రంగారెడ్డి జిల్లాలోని ప్రతీ గ్రామంలో గౌడ కులస్థుల ఆర్థికాభివృద్ధికి ఈత చెట్లను నాటుకునేందుకు ఐదెకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని గౌడ సంఘం జిల్లా సీనియర్ నాయకుడు బాకారం ఎల్లని వెంకటేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మొయినాబాద్ మండల గౌడ సంఘం సభ్యులతో కలిసి శనివారం నగరంలో అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గీతన్నలకు ద్విచక్ర వాహనాలను అందించాలని కోరారు. కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెంకటేష్ గౌడ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండలాధ్యక్షుడు అంజయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎల్లని నవీన్ గౌడ్, వివిధ గ్రామాలకు చెందిన గౌడ సంఘం నాయకులు ఉన్నారు.



తిమ్మాపూర్ వద్ద ఉత్తమ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మంత్రి ఉత్తమ్‌కు ఘన స్వాగతం

కొత్తూర్, సెప్టెంబరు 21: నియోజకవర్గ ముఖద్వారమైన మండల పరిధిలోని తిమ్మాపూర్ వద్ద రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. నందిగామ మండలం చేగూర్ శివారులో గల కన్హా శాంతివనంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చి మంత్రి ఉత్తమ్‌కు ఘన స్వాగతం లభించింది. మంత్రి తిమ్మాపూర్‌కు చేరుకోగానే ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జె. సుదర్శన్‌గౌడ్, నాయకులు ఎం.శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, జె.గోవర్ధన్‌గౌడ్, అంబటి ప్రభాకర్, దేవేందర్ ముదిరాజ్, జంగ నర్సింహ, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కావలి కృష్ణ, వసుపల మహేందర్, పాశం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ ప్రభుత్వ భూమిలో మోడ్రన్ కాలనీ ఏర్పాటు చేయాలి

● రెవెన్యూ మంత్రికి ఎమ్మెల్యే వీర్లపల్లి వినతి

కొత్తూర్, సెప్టెంబరు 21: మండల పరిధిలోని సిద్దాపూర్‌లో ఇటీవల ప్రభుత్వం గ్రామానికి కేటాయించిన 25ఎకరాల్లో నిరుపేదలకు, తెలంగాణ ఉద్యమకారుల కోసం మోడ్రన్ కాలనీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శనివారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సిద్దాపూర్ శివారులోని 330 ఎకరాల అసైన్డ్ భూమిని గత ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం సేకరించిన విషయం విదితమే. గ్రామ అవసరాల కోసం భూమి లేకుండా పోవడంతో ఎమ్మెల్యే శంకర్ గతంలో రెవెన్యూ మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి స్పందిస్తూ గ్రామ అవసరాల కోసం 25ఎకరాల కేటాయించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆ భూమిలోని 10ఎకరాల్లో మోడ్రన్ కాలనీ ఏర్పాటు కోసం కేటాయించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరిక మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

విద్యుత్ సరాఫరాలో నేడు అంతరాయం

చౌదరిగూడ, సెప్టెంబరు 21 : జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా నేడు(ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ఫీడర్ స్థిరత్వం, నాణ్యతను పెంచడానికి సరాఫరా నిలిపి వేస్తునట్లు వారు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

కేశంపేట, సెప్టెంబరు 21: స్థానిక సంస్థలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. శనివారం మండలంలోని లేమామిడి, బొదునంపల్లి, చౌలపల్లి, కొనాయపల్లిలోని కేంద్రాలను పరిశీలించారు. సౌకర్యాలు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. ఆయనతో ఎంపీవో కిష్టయ్య, కార్యదర్శులున్నారు.

'జ్ఞాన జాతర'ను జయప్రదం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న పెద్దరామయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు, సెప్టెంబరు 21: అక్టోబరు 14న కందుకూరు మండల కేంద్రంలో నిర్వహించనున్న అంబేద్కర్, జగ్జీవన్‌రావు జ్ఞాన జాతరను విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ జె.పెద్దరామయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్మగళ్ల నర్సింహ, కంద నర్సింహలు కోరారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందుగుల కృష్ణయ్య, సీహెచ్ రాములు, బి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



ఉపాధ్యాయులతో ఎండీవో సరిత, ఎంఈవో మనోహర్

కందుకూరు, సెప్టెంబరు 21: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎండీవో సరిత అన్నారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి మనోహర్‌తో కలిసి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 30మంది, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న 10మంది ఉపాధ్యాయులను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సన్మానించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, యుటీఎఫ్ మండల కార్యదర్శి బుగ్గరాములు, ఎస్టీయూ కార్యదర్శి వెంకటేశం, ట్రస్మా అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

శ్రీ వైష్ణవిని అభినందించిన కసిరెడ్డి



ఆమనగల్లు, సెప్టెంబరు 21: గత జూన్‌లో అంతర్జాతీయ ఎక్సలెన్స్ ఆఫ్ వరల్డ్ సంస్థ వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఆమనగల్లు వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రీవైష్ణవి పాల్గొని 13 నిమిషాల్లో ప్రపంచంలోని అన్ని దేశాల పేర్లు రాసి రికార్డు సృష్టించి అవార్డు అందుకుంది. కడ్తాలలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి సత్కరించారు. ఆయన సతీమణితో కలిసి జ్ఞాపిక అందించారు.

పారిశుధ్యంలో భాగస్వాములవ్వాలి

● స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీలత

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 21: సంపూర్ణ పారిశుధ్యంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత అన్నారు. శనివారం దండుమైలారం ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా టీచర్లు ప్రతిజ్ఞ చేయిచారు. రోజువారీ పారిశుధ్య పనులు ఎలా జరుగుతున్నాయని కార్యదర్శి శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో వెంకటమ్మ, హెచ్‌ఎం గోవర్దన్, ఏపీడీ సక్రియానాయక్, ఏపీవో తిరుపతాచారి తదితరులున్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదుట మానవహారం నిర్వహించారు. విద్యార్థులు,



ఇబ్రహీంపట్నం : దండుమైలారం పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్డీవో శ్రీలత



చౌదరిగూడ : పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

మహిళా సంఘాల సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీకాంత్ ర్యాలీని ప్రారంభించారు. ఏపీఎం శ్రీదేవి, గ్రామ సంఘాల అధ్యక్షులు, ఎంఈవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేశంపేట : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చెత్తాచెదారం తొలగించారు. పిచ్చి మొక్కలు, కలుపు గడ్డిని తీసివేశారు. ఎంపీడీవో మండలంలోని కోనాయలపల్లి, చౌలపల్లిలో శ్రమదానం చేపట్టారు. ఎంపీవో కిష్టయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలందరి సహకారం అవసరమని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ జగదీశ్వర్, జీహెచ్‌ఎం సునీతతో పాటు ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

శంకర్‌పల్లి : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. 11వ వార్డులో శనివారం త్రిపుల్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్ వినియోగం గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో చెత్తను తగ్గించే విధంగా సహకరించాలని కోరారు. ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ఉండటం, మట్టిలో కలిసిపోయే వస్తువులను వినియోగించాలని సూచించారు. మెప్మా ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.



కేశంపేట : సంతాపూర్‌లో పిచ్చిగడ్డి, చెత్తాచెదారం తొలిగిస్తున్న కార్మికులు

పాఠశాలల అభివృద్ధికి సహకారమందించాలి

చౌదరిగూడ/ఆదిభట్ల/శంకర్‌పల్లి/మాడ్గుల, సెప్టెంబరు 21: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని, బడులను బలోపేతం చేసేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని జీహెచ్‌ఎం సునీత కోరారు. శనివారం చౌదరిగూడ జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం నీలా మోహన్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థులకు సంస్కారంతో కూడిన విద్యనందించి ఉత్తమ పౌరులుగా మలిచే అవకాశం ఉపాధ్యాయులకే ఉందని కౌన్సిలర్ నారని మౌనికా సుధాకర్‌గౌడ్ అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్ టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పలు సూచనలు చేశారు. విద్యా కమిటీ చైర్మన్ తేజస్విని, హెచ్‌ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు రమేష్ బాబు, మౌనిక, అంగన్‌వాడీ టీచర్ మల్లమ్మ పాల్గొన్నారు. అలాగే గ్రామస్తుల భాగస్వామ్యంతోనే పాఠశాలలు పటిష్టమవుతాయని శంకర్‌పల్లి మండలం మోకిల తండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాములు తెలిపారు. పాఠశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతున్న దాత వర్త్య బాబునాయక్‌ను అభినందించారు. పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంటును సమకూర్చుతానని రాజునాయక్ హామీ ఇవ్వడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు శివకుమార్, భిక్షప్పలు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి సంఘ సేవకులు, పేరెంట్స్ కమిటీ పూర్తి సహకారం అందిస్తుందని ఎడ్యుకేషనల్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ సలహాదారుడు గోవింద్ శ్రీధర్ అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం మంగ, టీచర్లు పాల్గొన్నారు.



మాడ్గుల : సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు, పాల్గొన్న తల్లిదండ్రులు

కొండా లక్ష్మణ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



ఆమనగల్లు : లక్ష్మణ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆమనగల్లు/షాద్‌నగర్, సెప్టెంబరు 21: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన తుది శ్వాస వరకూ అవిశ్రాంతంగా పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఆమనగల్లు మున్సిపల్ వైస్‌చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, చేనేత సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగళి బాలకృష్ణలు అన్నారు. లక్ష్మణ్ 12వ వర్ధంతిని శనివారం ఆమనగల్లు పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం జిల్లా, మండల నాయకులు అవ్వారి శివలింగం, అప్పం శ్రీను, ఎంగలి రమేశ్, చిల్వేరు వాసు, గుజ్జరి శ్రీను, ఎంగళి ప్రసాద్, పున్న వెంకటేశ్, అప్పి, వాసు, దోర్నాల ఈశ్వరయ్య, మామిడిశెట్టి రవి, గంజి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ వర్ధంతిని పురస్కరించుకుని పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట జనార్దన్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం సభ్యులు షాద్‌నగర్ పట్టణం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలవేసి నివాళులర్పించారు. జనార్దన్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం మంత్రి పదవులను సైతం వదులుకున్న మహనీయుడు కొండా లక్ష్మణ్ అని కొనియాడారు. సంఘం ఉపాధ్యక్షుడు ఒగ్గు కిశోర్, నాయకులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ : కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న పద్మశాలీలు

బీఆర్ఎస్ కడ్తాల గ్రామ అధ్యక్షుడిగా కడారి రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న దశరథ్, వెంకటేశ్, జీఎల్ఎన్ రెడ్డి, పరమేశ్

కడ్తాల్, సెప్టెంబరు 21: బీఆర్ఎస్ కడ్తాల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఉపసర్పంచ్, సీనియర్ నాయకుడు కడారి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కడ్తాల మండలం మైసమ్మ ఆలయం వద్ద బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్‌ల సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గూడెపు మహేశ్, మీడియా కో-ఆర్డినేటర్‌గా ఎర్రోళ్ల రాజులను ఎన్నుకున్నారు. జోగు వీరయ్య, మంగళపల్లి నర్సింహ, లాయక్ అలీ, లచ్చిరామ్‌నాయక్, మహేశ్, రాంచంద్రయ్య, లక్ష్మణాచారి, వెంకటేశ్, మహేశ్, శ్రీకాంత్, ఈర్షద్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

చేవెళ్ల, సెప్టెంబరు 21 : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌గుప్తా అన్నారు. శనివారం దామరిగిద్ద ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన శేఖర్ వాటర్‌ఫిల్టర్‌ను ఉచితంగా అందజేశారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు దర్శన్, రామస్వామి, యాదయ్య, రాములు, అంజయ్య, విద్యార్థులు ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో మాజీ ఎంపీటీసీ చెన్నయ్య

షాబాద్, సెప్టెంబరు 21 : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ముద్దెంగూడలో పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రి వారి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పేదలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 269 మందికి పైగా పరీక్షలు నిర్వహించి 42 మందికి ఆపరేషన్ నిమిత్తం రిఫర్ చేశారు. చెన్నయ్య మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులు పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ముందుకు రావాలన్నారు. వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

చౌదరిగూడ/ఆమనగల్లు, సెప్టెంబరు 21: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి స్థాయిలో అమలు చేస్తుందని మాజీ సర్పంచ్ గోవర్దన్‌గౌడ్ అన్నారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని తంగళ్లపల్లిలో గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వంట గ్యాస్ వాడుతున్న మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్ గౌడ్, సతీష్, పద్మారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, శేఖర్, రాములు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకుముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని కేఎన్‌ఆర్ యువసేన విజయ్ రాథోడ్ అన్నారు. ఆమనగల్లు మండలం శంకర్‌కొండ తండాలో లబ్దిదారులకు కార్యదర్శి విజయ, డీలర్ కృష్ణలతో కలిసి ప్రొసీడింగ్‌లు అందజేశారు. లక్ష్మణ్, చంద్రు, హన్మంత్, దేవి, దోళి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుట్ట తండాను మా గ్రామంలో కలపొద్దు

● ఇన్‌చార్జి ఎంపీడీవోకు గూడూర్‌వాసుల వినతి

కొత్తూర్, సెప్టెంబరు 21: మక్తగూడ గ్రామపంచాయతీలోని పెద్దగుట్ట తండాను తమ గ్రామంలో కలపవద్దని మండల పరిధిలోని గూడూర్ గ్రామస్తులు శనివారం ఇన్‌చార్జి ఎంపీడీవో సుమిత్రను కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గూడూర్ గ్రామపంచాయతీలో ఉన్న పెద్దగుట్ట తండా నూతన జీపీగా ఏర్పడినా మక్తగూడలో విలీనం చేశారని తెలిపారు. కాగా, మక్తగూడ జీపీ తమకు అందుబాటులో లేదని, పెద్దగుట్టతండా వాసులు తమ తండాను తిరిగి గూడూర్‌లో కలపాలని ఇటీవల ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేందర్, పోచయ్య, నారాయణ, గణేశ్వర్ రాయపురెడ్డి, మైలారం రవి, లింగంగౌడ్, యాదయ్య, మైలారం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శంకర్‌పల్లి : రాబోయే కాలంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయని బెండ ఊరుకు చెందిన నారాయణ హృదయాలయ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ దేవిప్రసాద్ షెట్టి తెలిపారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి యూనివర్సిటీ 14వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆధునిక కాలంలో వైద్యరంగంలో డిజిటల్ సేవల పాత్ర అనే అంశంపై శుక్రవారం రాత్రి ఆన్‌లైన్ ద్వారా తన ప్రసంగాన్ని వినిపించారు.

శంషాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం యత్నిస్తుందని పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్ అన్నారు. సాతంరాయిలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు రెండు రోజులుగా రైతుల సమస్యలపై మాట్లాడుతూ ఎంతో ప్రేమ ఒలకబోస్తున్నారని, వాళ్ల మాటలు చూసి యావత్ రైతులు నవ్వుకుంటున్నారన్నారు.

తలకొండపల్లి : మంత్రి దామోదర రాజనర్సింహను కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్ హైదరాబాద్‌లో కలిసి సత్కరించారు. తలకొండపల్లి ప్రభుత్వాసుపత్రికి భవనం నిర్మించాలని, తగిన సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేసినట్లు మహేశ్ తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

కందుకూరు : కొత్తగూడ గ్రామ గణేశ్ మండపం నూతన అధ్యక్షుడిగా సామ ప్రతాప్ రెడ్డి ఎన్నియ్యారు. ఆయన రెండేళ్ల బాధ్యతలు చేపట్టనున్నట్లు మాజీ అధ్యక్షుడు సాద నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండపం వద్ద ఎన్నిక నిర్వహించారు. కమిటీలో 58మంది ఉండగా సామ ప్రతాప్‌రెడ్డి, బొక్క హన్మంత్‌రెడ్డిలు అధ్యక్ష ఎన్నికకు పోటీ పడగా ప్రతాప్‌రెడ్డి నాలుగు ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రేపటిలోపు సభ్యులుగా చేరేవారు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధ్యక్షులుగా సొడపు లక్ష్మయ్యగౌడ్, చీమల సురేష్, ప్రధాన కార్యదర్శిగా బొక్క ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారిగా బొక్క బాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా తల్లోజు లక్ష్మణాచారి, మక్తాల వెంకటేష్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

ఆమనగల్లు : కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఏళ్లకాలంగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ. నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా సోమ్లనాయక్, కోశాధికారిగా సురేశ్, పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కేశంపేట : గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు సమతుల ఆహారం తీసుకోవాలని కేశంపేట అంగన్‌వాడీ సూపర్ వైజర్ దివ్యాసింగ్ సూచించారు. నిర్దవెల్లిలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

షాద్‌నగర్ : అధికారిక కార్యక్రమాలకు సంబంధించి బీఆర్ఎస్ నేతలను సంబంధిత శాఖ అధికారులు విస్మరిస్తున్నారని బీఆర్ఎస్ ఫరూఖ్‌నగర్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ మీడియాతో మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన వైద్యారోగ్య శాఖ సమీక్ష సమావేశానికి తమకు ఎందుకు సమాచారం అందించలేదని ప్రశ్నించారు.

షాబాద్ : ప్రపంచంలోనే బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించిందని జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం సర్దార్‌నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి హరీష్ నాయకులు నరేష్, నవీన్, విష్ణు, రాము, రఘు, నరేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గోదాంలో చోరీ

● రూ.లక్ష నగదు, వెండి కాయిన్స్ అపహరణ

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 21: షాద్‌నగర్ పట్టణంలోని హాజీపల్లి రోడ్డు విజయ్ నగర్ కాలనీలోని ఓ గోదాంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన సంతోష్‌కుమార్ వివిధ రకాల వస్తువులతో హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటాడు. కాగా, అతడి కుటుంబం ఇంటిపై అంతస్తులో నివాసముంటుండగా.. కింది అంతస్తులో గోదాం నిర్వహిస్తున్నాడు. గుర్తు తెలియని దొంగలు గ్రిల్‌ను రాడ్‌తో వెడల్పు చేసి గోదాంలోకి చొరబడ్డారు. టేబుల్ డ్రాయర్‌లో ఉన్న రూ.లక్ష నగదు, 22 తులాల వెండి కాయిన్స్ అపహరించుకుపోయారు. ఈమేరకు బాధితుడు సంతోష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

● రెండిళ్లలో చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

● బంగారం, వెండి స్వాధీనం

కొత్తూర్, సెప్టెంబర్ 21: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం రెండు ఇళ్లలో చొరబడి బంగారం, వెండి అభరణాలు దోచుకెళ్లిన ఇద్దరు దొంగలను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని కటకటాలకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు కథనం మేరకు.. ఈనెల 18న మండల కేంద్రంలోని మల్లికార్జునకాలనీలో ఉంటున్న బాలునరేంద్ర ఇంటికి తాళం వేసి వెళ్లగా, గుర్తుతెలియని దుండగులు తాళం బద్దలు గొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న దాదాపు 5తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లారు. భవానినగర్ కాలనీలో ఉంటున్న రింకూదేవి ఇంటికి తాళం వేసి వెళ్లగా, తాళం బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించి 13తులాల వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై మురళీగౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గాలింపులు జరుపుతుండగా ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ నబీర్, ఏపీకి చెందిన షేక్‌నూర్‌మహమ్మద్‌లు గతంలో పలు నేరాలు చేసి జైలుకు వెళ్లి బెయిల్‌పై ఇటీవల బయటకు వచ్చి, తిరిగి నేరాలకు పాల్పడుతున్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తాళం వేసిన ఇళ్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వారి నుంచి బంగారం, వెండి అభరణాలు, 2సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు వారికి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏఎస్ఐ శ్రీనివాసాచారి, కానిస్టేబుళ్లు ఎర్ర కుమార్, రవికుమార్ కేసు చేధించినవారిలో ఉన్నారు. దొంగతనం కేసును రెండు రోజుల్లో చేధించిన కొత్తూర్ పోలీసులను పలువురు ఈ సందర్భంగా అభినందించారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

మార్కెట్ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే యాదయ్య అభినందనలు

చేవెళ్ల, సెప్టెంబరు 21 : చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం చైర్మన్ పెంటయ్యగౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శనివారం సాయంత్రం నగరంలో ఎమ్మెల్యే యాదయ్యను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వైస్ చైర్మన్ బి.రాములు, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సభ్యులు నక్క మల్లేష్, నరేందర్, సత్యనారాయణ, సుదర్శన్, హనీఫ్, తీగ యాదిరెడ్డి, తదితరులు ఉన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

చౌదరిగూడ, సెప్టెంబరు 21: పాడి రైతులకు గిట్టుబాటు ధరతో పాటు సామాజిక భద్రత కల్పించేలా హెరిటేజ్ డెయిరీ కృషి చేస్తుందని రీజినల్ మేనేజర్ నర్సింగ్‌రావు తెలిపారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని తంగళ్లపల్లిలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ సంస్థ పాడి రైతులకు రూ.2లక్షల ప్రమాద బీమాను కల్పిస్తూ, సబ్సిడీపై ఆవులు, గేదెలకు దాణా సరాఫరా చేస్తూ అండగా నిలుస్తుందన్నారు. పాడి రైతులు పశువులను కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయం కూడా అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్, ఏరియా మేనేజర్ వెంకటేష్, అనుపమ, మాజీ సర్పంచ్ గోవర్ధన్ గౌడ్, రాఘవేందర్, రాంచంద్రారెడ్డి, శ్రీను, శివ తదితరులున్నారు.

ఐకమత్యానికి పండుగలు దోహదం



లడ్డూను దక్కించుకున్న కడారి శ్రీశైలం యాదవ్

యాచారం, సెప్టెంబరు 21 : పండగలు యువతలో ఐకమత్యాన్ని పెంపొదిస్తాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ శంకర్‌కుమార్‌లు అన్నారు. శనివారం రాత్రి మాల్‌లోని వినాయక మండపంలో పూజలు చేసి గణేష్ శోభాయాత్రలో పాల్గొన్నారు. వారిని నిర్వాహకులు సత్కరించారు. భట్టు శ్రీనివాస్, పడకంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని నజ్దిక్‌సింగారం గ్రామంలో గణేష్ లడ్డూ వేలం వేయగా కడారి శ్రీశైలంయాదవ్ రూ.2,22,222లకు దక్కించుకున్నారు. కాగా, యాచారం మండల పరిధిలోని వినాయక లడ్డూల వేలంలో ఎక్కువ ధరకు దక్కించుకుంది ఇదే మొదటిసారి.

బోరు ఏర్పాటుతో తాగునీటి సమస్యకు పరిష్కారం

కొత్తూర్, సెప్టెంబరు 21: మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడలో మంచినీటి సమస్య నెలకొనడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. శనివారం కుమ్మరిగూడలో బోరు వేయడంతో పుష్కలంగా నీరు పడింది. దాంతో త్వరలో పంపు బిగించి నీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జోలీ రవీందర్, కౌన్సిలర్లు మాధవీ గోపాల్‌గౌడ్, మాదారం నర్సింహగౌడ్, సోమ్లానాయక్, ప్రసన్నలతా యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పోచారంను కలిసిన నాయకులు



కడ్తాల్, సెప్టెంబరు 21: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని శనివారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యానాయక్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, అన్మాస్‌పల్లి సర్పంచ్ శంకర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్యలు కలిశారు. అన్మాస్‌పల్లిలో రైతు సమ్మేళనంలో పాల్గొనడానికి వచ్చిన శ్రీనివాస్ రెడ్డిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.